
ప్రజాశక్తి
గురువారం 11 ఏప్రిల్ 2024
8 పేజీలు



తిరుపతి



చిత్తూరు

అభ్యర్థుల ఎన్నికల వ్యయం

తడిచి మోపెడు..!

ఎన్నికల రథం... దానికి డీజే సౌండ్ బాక్స్‌లు, పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్స్, ఫ్లెక్సీలు, ర్యాలీలు, వాటి వాహనాలకు పెట్రోల్, డీజిల్...ఇక ప్రచారానికి మనుషులు, వారితో పాటు కార్యకర్తలకు, ద్వితీయ స్థాయి నాయకులకు మందు, విందు.. ఇలా ఎన్నికల్లో అభ్యర్థులకు ఖర్చు తడిసి మోపెడవుతోంది. భారీగా పెరిగిన ఖర్చులతో అభ్యర్థులు బెంబేలెత్తుతున్నారు. నిబంధనల ప్రకారం ఒక అభ్యర్థి ఎన్నికల వ్యయం మొత్తం రూ.40లక్షలలోపే ఉండాలనీ ఎన్నికల కమిషన్ నిబంధన విధించినప్పటికీ ... ఒక్కో అభ్యర్థి ఒక్కరోజులోనే 40 నుంచి 50 లక్షల రూపాయల వరకు ఖర్చు చేస్తుండటం గమనార్హం.

- రోజుకు రూ.700పైన ఇస్తేనే ప్రచారానికి
- ప్రతిరోజూ మందు, విందు
- రోజుకు 40-50 లక్షలపైనే ఖర్చు
- తలలు పట్టుకుంటున్న అభ్యర్థులు



ప్రజాశక్తి - తిరుపతి

ప్రచారానికి రూ.700-1000 ఇస్తేనే..

నాయకులతో పాటు తిరుగుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే మనుషులకు గతంలో రోజుకి 500 నుంచి 700 ఇచ్చేవారు. అయితే ఇప్పుడు కనీసం 700 నుంచి 1000 రూపాయలు ఇస్తేనే గాని మనుషులు దొరికే పరిస్థితి లేదంటూ అభ్యర్థులు వాపోతున్నారు. ఇలా నియోజక వర్గం అంతా ప్రచారం చేసే మనుషులకి రోజుకి సుమారు 10 లక్షల వరకు ఖర్చు అవుతున్నట్లు సమాచారం.

ఇక చిన్నపాటి సభలు, సమావేశాలకు ఒక్కో చోట కనీసం రూ.2 లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు పెడుతున్నారు. ఇది కాక వార్డుస్థాయిలో ప్రచారం చేసేందుకు అయ్యే ఖర్చులను అభ్యర్థులు బూత్‌స్థాయి నేతలకు ఇస్తున్నారు. ఒక్కో వార్డుకూ ఈ ఖర్చు దాదాపుగా రూ.3 లక్షల నుంచి 5 లక్షల వరకు ఉంటోందని సమాచారం. ఉదాహరణకు తిరుపతి నగరంలో ఓ ప్రధాన అభ్యర్థి వార్డ్ స్థాయి ప్రచారానికే రోజూ సుమారు రూ.20-25 లక్షల మధ్య ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇక చంద్రగిరి నియోజకవర్గంలో అధికార పార్టీ అభ్యర్థి రోజువారీ ఖర్చు రూ.50 లక్షల దాకా ఉంటున్నట్టు సమాచారం. తన నియోజక వర్గంలోని అన్ని గ్రామాల్లో పార్టీ కార్యాలయాన్ని, సమీపంలోనే ఓ వంటశాలను కూడా ఏర్పాటు చేశారు. నిత్యం అక్కడ సుమారు 200 నుంచి 300 మంది వరకూ కార్యకర్తలకు భోజనం చేస్తున్నారు. అలా.. ఒక్క భోజన ఖర్చే రోజుకు రూ.లక్షల్లో అవుతోంది.

'ట్రెండు'మారింది


సాధారణంగా అభ్యర్థులు గ్రామాల్లో ప్రచారానికి వచ్చినప్పుడు స్థానికంగా ఉండే నేతలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అంతా తామై వ్యవహరిస్తుంటారు. ఆయా గ్రామాల్లో ప్రచారానికయ్యే వ్యయాన్ని వారే భరించేవారు. కానీ, ఇప్పుడు ట్రెండ్ మారింది. గ్రామ, వార్డు స్థాయిలో అయ్యే ఎన్నికల ప్రచార వ్యయాన్ని ఇప్పుడు అభ్యర్థులే భరించాల్సిన పరిస్థితి. వారు ప్రచారానికి వచ్చినప్పుడు వారికి వేసే పూల దండలు, డీజే సౌండ్,

తరువాయి.. 2లో

గోవిందా..ఇదేమైనా బాగుందా..!

- ఎండ తీవ్రతకు భక్తులు విలవిల
- మాడా వీధుల్లో కూల్ పెయింట్ ఏది
- కాళ్లకు గోనెసంచులు కట్టుకున్న భక్తులు
- టీటీడీ అధికారుల తీరుపై విమర్శలు

తిరుమలలో కొందరు భక్తులు కాళ్లకు గోనె సంచులు కట్టుకుని కనిపించారు. కొండపై ఎండ తీవ్రత విపరీతంగా పెరగడమే దీనికి కారణం. ఆలయ పరిసర ప్రాంతాల్లోని కాలిబాటలో కొన్నిచోట్ల కూల్ పెయింట్ వేయకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వేడి నుంచి పాదాలను కాపాడుకునేందుకు లడ్డూ ప్రసాద వితరణకు వినియోగించే గోనె సంచులను పాదాలకు ధరించి భక్తులు నడుస్తున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలోనే టీటీడీ వెంటనే చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.




ప్రజాశక్తి -తిరుమల : తిరుమల అంటేనే ఆధ్యాత్మిక ప్రాంతం.. మాడావీధుల్లో చెప్పులు వేసుకుని తిరగరాదనే నిబంధన ఉంది.. అయితే ఆ విషయం సూరీడుకు తెలియదేమో మరి.. వాతావరణ మార్పుల నేపథ్యంలో కొండపైనా నిప్పులు కురిపిస్తున్నాడు.. దీంతో భక్తులు చెప్పులు వేసుకోలేక, గోనెసంచులు కట్టుకుని మాడావీధుల్లో తిరగడం కనిపించింది. శ్రీవారి సంచులు కాళ్లకు కట్టుకోవడం ఏంటన్న విమర్శలు వెల్లువెత్తినా, మాడా వీధుల్లో ఇంజినీరింగ్ శాఖ కూల్ పెయింట్ వేయకపోవడం వల్లనే భక్తులు ఎండను భరించలేకే అలా చేశారనే చర్చ సోషల్‌మీడియాలో నడుస్తోంది. ఏదిఏమైనా మండు వేసవిలో టిటిడి ఉన్నతాధికారులు భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సి ఉండగా, అటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే భక్తుల ఇబ్బందులు వర్ణనాతీతం.



గోనెసంచులతో భక్తులు

ఏప్రిల్ మొదటివారంలోనే సూర్యుడు తన ప్రతాపాన్ని తీవ్రతరం చేశాడు. దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పలు జిల్లాలు నిప్పుల కుంపటిలా మారాయి. చిత్తూరు జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఇటు తిరుమలకొండపైన భానుడు భగభగమంటున్నాడు. వేసవి సెలవులకు తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. వీరిలో కాలినడకన వెళ్లే భక్తులు కూడా ఉంటారు. రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో కాలిబాటలు, మాడవీధులు కాలుతున్న పెనంలా

తరువాయి.. 2లో



అదిగో.. నెలవంక

నేడు రంజాన్

వార్త 8లో



వలసలను ఆదరించిన తిరుపతి

- రాజకీయ ఉద్దండులు ఇక్కడినుంచే
- ఆధ్యాత్మిక నగరంలో 'త్రిముఖ' పోటీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఆధ్యాత్మిక నగరమైన తిరుపతి అసెంబ్లీ చరిత్ర పరిశీలిస్తే వలసలను ఎక్కువసార్లు ఆదరించిందనే చెప్పాలి. దేశ, రాష్ట్ర రాజకీయాల్లో కీలకమైన ఉద్దండులను ఇక్కడినుంచి పంపింది. 1951లో 'డి'లిమిటేషన్ ఆర్డర్స్ ప్రకారం తిరుపతి శాసనసభ ఏర్పాటయ్యింది. ఇప్పటివరకూ 15 సార్వత్రిక, ఉప ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో వలసొచ్చిన రాజకీయ ఉద్దండులను అసెంబ్లీకి పంపించింది. ఈ నేపథ్యంలోనే తిరుపతి అసెంబ్లీ సీటు కీలకంగా మారింది. స్వాతంత్ర్య సమరయోధులు రెడ్డివారి నాదమునిరెడ్డి, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు, శాసనసభ స్పీకర్‌గా ఉన్న అగరాల ఈశ్వర్‌రెడ్డి, కొణిదెల చిరంజీవిలు ఉద్దండులుగా ఉన్నారు. ఆవుల మోహన్, చదలవాడ క్రిష్ణమూర్తి, కరుణాకర్‌రెడ్డిలు ఇతర ప్రాంతాల నుంచి వలసొచ్చి ఇక్కడ పోటీచేసి విజయాన్ని కైవసం చేసుకున్నారు. ప్రస్తుతం పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు 'వలసవాది' కావడం గమనార్హం. తిరుపతి సిట్టింగ్ ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి కుమారుడు అభినయ్‌రెడ్డి వైసిపి తరపున బరిలో ఉన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ఇండియా వేదికగా అసెంబ్లీకి పోటీ చేస్తున్నారు. 'అభివృద్ధి' పేరుతో వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి ప్రచారం చేస్తుండగా, ప్రజా సమస్యలపై పోరాటం చేసిన సిపిఐని ఆదరించాలని పి.మురళి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న

తరువాయి.. 4లో

(మొదటి పేజీ తరువాయి)

గోవిందా.. ఇదేమైనా బాగుందా..!



మారుతున్నాయి. మాఢవీధుల్లో ఎండతీవ్రతకు భక్తులు నడవలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నడక మార్గంలో, మాడ వీధుల్లో కాళ్లకు గోనెసంచులు కట్టుకొని భక్తులు స్వామి దర్శనానికి వెళ్తున్నారు. ఎండ తీవ్రతనుంచి భక్తులకు ఉపశమనం కలిగించేలా టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ భానుడి ప్రతాపం నుంచి అవి రక్షణ కల్పించలేకపోతున్నాయి.

ఈ క్రమంలో తిరుమలలో భక్తులు కాళ్లకు గోనె సంచులు కట్టుకొని విచిత్రంగా కనిపించారు. కొండపై ఎండ దెబ్బకు మాడ వీధుల్లో నడవలేకపోతున్నామని భక్తులు అంటున్నారు. అందుకే తాము గోనె సంచుల్ని ఇలా కట్టుకుని నడవాల్సి వస్తుందంటున్నారు. మాడ వీధుల్లో కొన్ని చోట్ల కూల్ పెయింట్ వేయలేదని.. వెంటనే అక్కడ కూడా కూల్ పెయింట్ వేస్తే బావుంటుందని టీటీడీని కోరుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలోనే టీటీడీ వెంటనే చర్యలు తీసుకోవాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. టీటీడీ కూల్ పెయింట్ వేసి వేసవి ఉపశమన చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. ఈఏడాది ఎల్‌నినో తీవ్రత కొనసాగుతున్నందున ఏప్రిల్ నుంచి జూన్ వరకు వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఐఎండీ అంచనా వేసింది. అయితే భక్తులు గోనెసంచులను కాళ్లకు కట్టుకోవడంపై సోషల్ మీడియాలో టిటిడిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెటిజన్లు సైతం టిటిడి భక్తులతో వ్యవహరిస్తున్న తీరును తప్పుబడుతున్నారు. భక్తుల శ్రీవారికి సమర్పించే డబ్బులు కావాలి...కానీ వారికి సౌకర్యాలు కల్పించడం చేతకాదా? అంటూ నిలదీస్తున్నారు. దేశంలోనే రిచ్చెస్ట్ ఆలయంలో ఈ పరిస్థితి వుంటే ఇక మిగతా ఆలయాల్లో పరిస్థితి ఏమిటని మరికొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా శ్రీవారి భక్తుల జూట్ బ్యాగ్ వ్యవహారం సంచలనంగా మారింది.

అభ్యర్థుల ఎన్నికల వ్యయం

తడిచి మోపెడు..!

డప్పులు, టపాసుల ఖర్చు అంతా ఇప్పుడు అభ్యర్థులే స్వయంగా పెట్టుకుంటున్నారని ఓ కార్యకర్త తెలిపారు.

మందు , విందుల హోరు

ప్రచారంలో పాల్గొనే మనుషులు, కార్యకర్తలకు రోజుకు రెండు పూటలా మందు విందులు ఇవ్వాల్సిందేనని అభ్యర్థులు బావురు మంటున్నారు. ఒక్కో బిర్యాని ప్యాకెట్టు కనీసం 100 నుంచి 150 రూపాయలు పెడితేనే కానీ కుదరదు అంటూ వాపోతున్నారు. ఇక మందు విషయానికొస్తే "మాకు లోకల్ బ్రాండు వద్దు...మంచి బ్రాండులే కావాలి" అంటూ డిమాండ్ చేసి మరి కొనిపించుకుంటున్నారు. ఇక కుల సంఘాల, ఆత్మీయ సమావేశాలు అంటూ నిర్వహిస్తున్న మీటింగులకు ప్రతిరోజు ఐదు నుంచి పది లక్షల వరకు ఖర్చవుతుంది. అలాగే పగలంతా ప్రచారం చేస్తున్న అభ్యర్థులు రాత్రి వేళల్లో మాత్రం ముఖ్య నాయకుల బుజ్జగింపులు, పోల్ మేనేజ్మెంట్ మీటింగ్ కు సంబంధించి పెద్ద ఎత్తున ఖర్చు పెట్టాల్సిన వస్తుండడం గమనార్హం. ఇలా ప్రతిరోజు 40 నుంచి 50 లక్షల వరకు ఖర్చు అవుతున్నట్లు తిరుపతిలోని ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి బాహాటంగా వాపోతుండటం గమనార్హం. జనరల్ కేటగిరి లు కాకుండా రిజర్వుడు స్థానాల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు మాత్రం ఖర్చు విషయంలో కాస్త ఊరట లభిస్తుందనండం గమనార్హం.

నిబంధనలు గాలికి..

పుట్టగొడుగుల్లా ఇటుక బట్టీలు

- ఎలాంటి పన్ను కట్టని వ్యాపారులు
- పాఠశాల, నివాస గృహాలు, ఆర్‌అండ్‌బి రోడ్ల పక్కనే తయారీ
- ఇదీ ఇటుక బట్టీల యజమానుల తీరు



ప్రజాశక్తి -కోట

నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఎండాకాలం సమీపించడంతో ఇప్పటి నుండే ఇటుకల వ్యాపారం మొదలైంది. ఇతర ప్రాంతాల నుండి కూలీలను తీసుకువచ్చి ఇక్కడ వ్యాపారులు కనీస నిబంధనలు పాటించకుండా యథేచ్ఛగా వ్యాపారం చేయడం పలు సమస్యలకు దారి తీస్తోంది. కనీసం అధికారులు అక్రమ ఇటుక బట్టీల వైపు కన్నెత్తి కూడా చూడక పోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది.

నిబంధనలు గాలికి..

మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలకు ఇటుకలను వాడుతున్నారు. దీంతో వీటికి మంచి గిరాకీ వుంది. ఈ నేపథ్యంలో కోట మండలంలోని వెంకన్నపాలెం గ్రామం పక్కనే వాకాడుకు వెళ్లే మెయిన్ ఆర్ అండ్‌బిరోడ్డు పక్కనే భారీ స్థాయిలో ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఇటీవల ఓ యజమాని ఇష్టానుసారం రోడ్డు పక్కనే వ్యాపారం కొనసాగించడం చర్చనీయాంశంగా మారింది. అది కాకుండా పచ్చని పంట పొలాల్లో ఇలా ఇటుక బట్టీలు తయారు చేయడం వల్ల పక్కనే ఉన్న పంటలకు నష్టం వాటిల్లుతోందని పలువురు రైతులు వాపోతున్నారు. రోడ్డు పక్కనే బట్టీలకు నిప్పు పెట్టడంతో రోడ్డు మొత్తం పొగతో నిండుతోంది. దీంతో ఆ దారిలో వచ్చివెళ్లే ప్రయాణికులకు పలు సమస్యలు తలెత్తుతున్నాయని, ఆ పొగ రోడ్డుమీదికి వస్తే ప్రయాణికులు కళ్లు మూసుకోవడంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు తిమ్మనాయుడుపాళెంలో ప్రాథమిక పాఠశాల పక్కనే ఓ యజమాని ఇటుక బట్టీలు నిబంధనలకు విరుద్ధంగా తయారు చేయడంతో పాఠశాల కిటికీల్లో నుండి పొగ, దుమ్ము, దూళితో నానారకాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ పక్క విద్యార్థుల తల్లిదండ్రులు సమస్యలు ఎదుర్కొంటున్నారు. మరో పక్క నివాస గృహాలు పక్కనే ఇటుక బట్టీలు తయారు చేయడం వల్ల దుమ్ము, దూళి, పొగ, వాసన లాంటివి ప్రత్యక్షంగా పరిసర గ్రామాలను చుట్టుముట్టుతున్నాయి. దుస్తులు ఉతికి బయట ఆరేసుకోవడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది. ఇటుక బట్టీలు కాల్చేటప్పుడు వచ్చే వాసన భరించలేక దుస్థితి నెలకొందని కొంత మంది గృహిణిలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ భవనం కూడా నలుపు రంగులోకి మారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎలాంటి పన్ను కట్టని వ్యాపారులు

ఏటా రూ.కోట్లలో వ్యాపారం జరుగుతున్నా.. వీటి నిర్వాహకులు గ్రామ పంచాయతీలకు ఎలాంటి పన్నులు చెల్లించడం లేదు. వ్యాపారంలో 2 శాతం పన్ను చెల్లించాలని నిబంధనలు ఉన్నా బట్టీల వ్యాపారులు పట్టించుకోవడం లేదు. గ్రామ పంచాయతీ సమీపంలోనే సుమారు పదుల సంఖ్యలో ఇటుక బట్టీలు కొనసాగుతున్నాయి. ఒక్క మండలంలోనే 50కు పైగా బట్టీలు ఉన్నాయి. ప్రతి బట్టీలోనూ దాదాపు లక్ష నుంచి పది లక్షల వరకు ఇటుకలు కాల్చి ఒక్కొక్కటి రూ.7 చొప్పున మార్కెట్లో విక్రయిస్తుంటారు. ఒక యాజమాని కనీసం ప్రతీ వేసవిలో 5 లక్షల నుంచి 10 లక్షల వరకు ఇటుకలు విక్రయిస్తారు. వీటి ద్వారా సుమారు రెండు కోట్ల రూపాయలు వరకు వ్యాపార లావాదేవీలు జరుగుతుంటాయి. కానీ పంచాయతీలకు ఎలాంటి పన్నులు చెల్లించడం లేదని పంచాయతీ, రెవెన్యూ, విద్యుత్ శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారా? లేదా ఏదైనా ఇటుక బట్టీల యాజమాన్యం, అధికారులు మధ్య తత్సంబంధాలు ఏమైనా ఉన్నాయా? అని స్థానిక సమీప నివాస ప్రజలు గుసగుసలాడుతున్నారు. విక్రయ సమయంలో ఎలాంటి రసీదులు ఇవ్వడం లేదు. దీంతో వాణిజ్య పన్నుల శాఖకు చెల్లించాల్సిన రెండు శాతం పన్నులు చెల్లించడం లేదు. పంచాయతీ రాజ్ యాక్టు ప్రకారం గ్రామంలో జరిగే విక్రయాల్లో 2 శాతం పంచాయతీ ఖాతాల్లో ఖచ్చితంగా జమ చేయాల్సి ఉంటుంది. కానీ వ్యాపారికి నేరుగా కొనుగోలు దారులు డబ్బులు చెల్లించడంతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది. ప్రతీ ఇటుక బట్టీతో వ్యాపారులు లాభాలు ఆర్జిస్తుంటే పంచాయతీలకు మాత్రం పన్ను కట్టడం లేదు. బట్టీల నిర్వహణకు పంచాయతీల అనుమతి తీసుకోవాలనే నిబంధనలు ఉన్నా వాటినీ పట్టించుకోవడం గమనార్హం.

పచ్చని పొలాల్లో ఇటుకబట్టీల వ్యాపారం

భూ పరిరక్షణ చట్టం ప్రకారం వ్యవసాయానికి పనికి రాని భూముల్లోనే ఇటుక బట్టీలు నిర్వహించాలి. కానీ గ్రామీణ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా పచ్చని పంట భూముల్లో ఇటుక బట్టీలు ఏర్పాటు చేస్తున్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకొని అధికారులకు మామూళ్లు చెల్లించి అడ్డదారుల్లో బట్టీలు నిర్వహిస్తున్నారనే విమర్శలూ లేకపోలేదు. మండల కేంద్రానికి, గ్రామాలకు కూత వేటు దూరంలోనే ఈ వ్యవహారం యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయా పంచాయతీ పరిధిలోని శివారు ప్రాంతాల్లో పంట పొలాల్లో ఇటుక బట్టీలను కొనసాగిస్తుండడం గమనార్హం. పచ్చని పొలాల పక్కనే ఇటుక బట్టీలు నిర్వహిస్తుండడంతో ఆ ప్రభావం వాటిపై పడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

అధికారుల పర్యవేక్షణ శూన్యం.. పట్టించుకోని అధికారులు..

ఇదిలా ఉండగా పంచాయతీ అసైన్డ్ భూముల్లో సైతం ఈ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. అంతే కాకుండా కొన్ని ఏజెన్సీ గ్రామాల్లో ఇటుక బట్టీ వ్యాపారులు అటువైపు నుంచి ప్రవహిస్తున్న వాగుల్లోనే, వ్యవసాయ విద్యుత్ మోటార్లను కమర్షియల్ విద్యుత్ మోటార్లుగా ఏర్పాటు చేసి ఇటుకల తయారీ కోసం నీళ్లు ఉపయోగిస్తున్నారు. ఇంతా జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. యథేచ్ఛగా ఇటుక బట్టీల వ్యాపారులు వాగులకు మోటార్లు ఏర్పాటు చేసుకుని ఇటుకల తయారీకి వాడుకోవడంతో వాగులో నీళ్లు ఇంకిపోతున్నాయి. దీంతో పంటల సాగుకు నీళ్లు పూర్తి స్థాయిలో అందక పంటలు సైతం ఎండిపోతున్నాయని పలువురు రైతులు వాపోతున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వెంటనే పరిశీలిస్తాం

పాఠశాల పక్కనే ఇటుకల బట్టీలు నిర్వహించడం పై 'ప్రజాశక్తి' ఎంఈవోను వివరణ కోరగా నిజమే కదా..? విద్యార్థుల చదువులకు ఆటంకాలు లేకుండా చూస్తాం.. వెంటనే పరిశీలిస్తాం..

- దారా మస్తానయ్య, కోట ఎంఈవో.

నానా ఇబ్బందులు పడుతున్నాం..



ఇటుక బట్టీల తయారీ వల్ల మా గృహాలు అంతా దుమ్ము, ధూళి, పొగతో నిండి పలు రకాల ఇబ్బందులు పడుతున్నాం.. పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

-కోసన వసుంధర, స్థానికురాలు.

మా సమస్యలు పరిష్కరించండి..



అధికారులు మా సమస్యలు క్షుణ్ణంగా పరిశీలించి న్యాయం చేయాలి..

- సుజాతమ్మ , పేట.

బెదిరించినా కాంగ్రెస్ వైపే నిలబడ్డాను: అన్నపూర్ణమ్మ



మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం)

కాంగ్రెస్ పార్టీ వెంట ఉన్నానని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు తన కుటుంబంపై బెదిరింపులకు దిగారని అయినా ధైర్యంగా కాంగ్రెస్ పార్టీ వైపే నిలబడ్డానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జంగాలపల్లి అన్నపూర్ణమ్మ తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆమె విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కోసం 1999 నుండి అనేక దశల్లో కష్టించి పనిచేశానని, నేడు పార్టీ కోసం కష్టపడిన వారిని కాకుండా వేరొక వ్యక్తికి శ్రీకాళహస్తి టికెట్టు ఇవ్వడం బాధించిందన్నారు. 33 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి, తిరుపతి జిల్లాలో ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా మహిళలకు ఇవ్వకపోవడం దారుణం అన్నారు. ఎమ్మెల్యే సీటు కేటాయించాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసిన ఫలితం లేకుండా పోయిందన్నారు. అంటే పార్టీ కోసం కష్టపడిన వారిని కాకుండా డబ్బున్న వాళ్ళకే సీట్లు కేటాయిస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తన సీనియారిటీని గుర్తించి కాంగ్రెస్ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం టికెట్టు తనకు ఇవ్వాలని అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు.

మహిళలకు ప్రాధాన్యత ఏది?



నగరి: కాంగ్రెస్ పార్టీలో మహిళలకు ప్రాధాన్యత ఎక్కడ...? అని ఆ పార్టీ గంగాధర నెల్లూరు అసెంబ్లీ సీటుకు ధరఖాస్తు చేసుకున్న టి.అములు ప్రశ్నించారు. బుధవారం ఆమె నగరిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ నేతత్వంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇద్దరు మహిళలకు అసెంబ్లీ స్థానాలు కేటాయించేవారని ప్రస్తుతం ఆ ప్రాధాన్యత ఏమైందన్నారు. షర్మిలమ్మ అనే మహిళ నేతత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలోనే మహిళలకు ప్రాధాన్యత దక్కడం లేదన్నారు. జిల్లాలో ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే మహిళలకు ప్రాధాన్యత ఇచ్చి ఇద్దరికి అవకాశం కల్పించిందన్నారు. మిగిలిన పార్టీలు ఏవీ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గంగాధర నెల్లూరులోను, పూతలపట్టులోను కనీసం సీటుకోసం ధరఖాస్తు చేసుకోని వారికి సీట్లు కేటాయించారన్నారు. ఆర్థిక బలమే వారికి దరఖాస్తుగా మారిందన్నారు. కార్వేటినగరం మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు టికెట్ విషయమై రూ.లక్ష డిమాండ్ చేశారన్నారు. దాన్ని తిరస్కరించడమే సీటు రాకపోవడానికి కారణమైందన్నారు. రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షులుగా ఉన్న డాక్టర్ నరసింహులు రెండు పర్యాయాలు గంగాధర నెల్లూరు నుంచి తలపడ్డారని ఆయనకు కూడా సీటు కేటాయించలేదన్నారు.

213 ఫిర్యాదులు పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై అందిన వివిధ ఫిర్యాదులను పరిష్కారం కొరకు చర్యలు తీసుకున్నట్లు సదరు నివేదికను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో చర్యలు తీసుకోవడం జరుగుతోందని, అందులో భాగంగా.. బుధవారం మధ్యాహ్నం వరకు నివేదికల మేరకు ప్రింట్ మీడియా ద్వారా 223 ఫిర్యాదులు అందగా 213 ఫిర్యాదులను పరిష్కరించడం జరిగిందన్నారు. మిగిలిన 10 పురోగతిలో ఉన్నాయని తెలిపారు. కంప్లైంట్ మానిటరింగ్ యాప్/సీఈవో ద్వారా 47 ఫిర్యాదులు అందగా 44 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. ఎఫ్.ఎస్.టి., ఎస్ఎస్‌టి, పోలీసు ఎన్ఫోర్స్మెంట్ టీమ్స్ ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ ద్వారా కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ. 58.18 లక్షలు మేర నగదు, రూ.19.45 లక్షల విలువైన లిక్కర్, ఇతర వస్తువులను కలిపి మొత్తం రూ.3.12 కోట్లు సీజ్ చేయడం జరిగింది. సివిజిల్ ద్వారా అందిన ఫిర్యాదులు నేటి వరకు మొత్తం 538 అందగా అందులో సరైన కేసులు 410 పరిష్కరించడమైనదని, అందులో 128 సరియైన ఫిర్యాదులు కానందున డ్రాప్ అయ్యాయని తెలిపారు. అలాగే ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన వారిపై తీసుకున్న చర్యలు ఏప్రిల్ 10 నాటికి 19 మంది వాలంటీర్లను తొలగించడం జరిగిందని, రెగ్యులర్ ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు సస్పెండ్ 5మందిని చేయడమైనదని తెలిపారు. అలాగే రేషన్ డీలర్ ఒకరిని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు 6మందిని తొలగించడం జరిగిందని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినప్పటి నుండి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా నేటి వరకు ప్రభుత్వ ఆస్తులపై ఏర్పాటు చేసిన గోడ రాతల తొలగింపు, బ్యానర్లు, పోస్టర్లు, ఇతరాలు తొలగింపులో 23,201, అలాగే ప్రైవేట్ ఆస్తులపై అంటించించిన వాటి తొలగింపు 7652 చేయడం జరిగిందని తెలిపారు. అలాగే డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ త్రిసభ్య కమిటీ ద్వారా సామాన్య ప్రజలకు, వ్యాపారులకు చెందిన సీజ్ చేసిన నగదు 17 కేసులలో రూ. 35,06,559 కాగా వాటిని సమీక్షించి నేటి వరకు 13 కేసులకు సంబంధించిన మొత్తం రూ.26,07,550 ను సంబంధీకులకి తిరిగి అందించామని మిగిలిన నాలుగు పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు.

గుర్తు తెలియని అనాథ మృతి

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలం లోని పివిపురం పంచాయతీ సంజీవరాయపురం గ్రామ సమీపంలో రామచంద్రాపురం- పచ్చికాపలం రోడ్డు పక్కన సుమారు 45 నుండి 50 సంవత్సరాలు వయసు కలిగిన గుర్తు తెలియని అనాథ వ్యక్తి మృతి చెందాడు. బుధవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చుట్టుపక్కల గ్రామాలలో పోలీసులు విచారణ చేయగా మృతుడు గత 20 రోజులుగా మతిస్థిమితం లేక ఒంటిపై దుస్తులు కూడా లేకుండా తిరుగుతూ ఒక్కొక్కసారి దారిన పోయే వారిపై పిచ్చిగా ప్రవర్తించేవాడని తెలిపారన్నారు. బుధవారం కుప్పం బాదూరు పరిసర ప్రాంతాల్లో పిచ్చివాడిలా తిరుగుతుండగా స్థానికులు 108 ఫోన్ చేసి ఆ వ్యక్తిని హాస్పిటల్‌కు తరలించేందుకు యత్నించారు. కానీ మతిస్థిమితం లేకపోవడంతో అతను 108 వాహనం ఎక్కకపోవడం వల్ల కుప్పం బాదూరులోనే వదిలేశారు. ఆర్సిపురం పోలీసులు కూడా కుప్పం బాదూరుకి వెళ్లి పరిశీలించగా మతి స్థిమితం లేని వ్యక్తి అక్కడి నుండి వెళ్లిపోయాడు. మృతుడు నీలి కలర్ షర్టు ధరించి ఉన్నారు. మృతుడు కన్నడంలో మాట్లాడుతున్నట్లు స్థానికులు తెలిపారు. గత రెండు రోజులుగా ఎండలు మండుతున్నాయి.. దీంతో వడదెబ్బకు గురై మృతి చెంది ఉండవచ్చని స్థానికులు అంటున్నారు. మృతదేహానికి ఆర్ సి పురం పోలీసులు దహన క్రియలు చేసేందుకు పివిపురం పంచాయతీ అధికారులకు అప్పగించారు. పంచాయతీ అధికారులు దహన క్రియలు నిర్వహించారు.



మృతి చెందిన అనాథ వ్యక్తి

క్రైం న్యూస్

పెంపుడు తల్లి మృతితో వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: తనను పెంచుకున్న తల్లి మృతి చెందడంతో వివాహిత తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. దుర్గ బజార్లో చిత్తు కాగితాలు ఏరుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె తండ్రి పవన్‌కు ఇద్దరు భార్యలు వున్నారు. మొదటి భార్య వరదయ్యపాళ్యెం మండలంలో ఓ చేపల దుకాణంలో చేపలు శుభ్రపరుస్తూ జీవనం సాగిస్తోంది. కొద్ది రోజుల క్రితం ఆమె చేపలు శుభ్రపరిచిన తర్వాత స్నానం చేసేందుకు చెరువు వద్దకు వెళ్లి స్నానం చేస్తుండగా ప్రమాద వశాత్తు మునిగి మృతి చెందింది. వరదయ్యపాళెం మండల పోలీసులు ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతి చెందడంతో తీవ్ర మనస్థాపం చెందిన రెండవ భార్య కుమార్తె దుర్గ తనను పెంచుకున్న తల్లి చనిపోయిందని ఆవేదనతో బుధవారం ఉదయం పురుగుల మందు తాగింది. స్థానికులు వెంటనే దుర్గను బుచ్చినాయుడు కండ్రిగ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రిలోనే వుంచారు. బుచ్చినాయుడు కండ్రిగ మండల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడరును ఢీకొన్న కారు

- ఒకరు మృతి, మరొకరికి గాయాలు

ప్రజాశక్తి-పూతలపట్టు: మండలంలోని కిచ్చన్నగారిపల్లి గ్రామం వద్ద బుధవారం సాయంత్రం జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి డివైడరును ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి నగరానికి చెందిన దీపక్ రెడ్డి, వివేక్ ఇద్దరూ కారులో బెంగళూరుకు వెళుతుండగా మార్గ మధ్యంలో చోటు చేసుకున్న ఈ ప్రమాదంలో దీపక్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా వివేక్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు సీఐ సుదర్శన ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారా స్వాధీనం

- వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-సదుం: నాటు సారా తయారు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మారుతి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమకు ముందస్తు అందిన సమాచారం మేరకు మండలంలోని రెడ్డివారిపల్లి ప్రాజెక్టు వద్ద సోదాలు చేపట్టామన్నారు. అక్కడ సారా తయారు చేస్తున్న దేరంగుల భరత్‌ను గుర్తించి అరెస్ట్ చేశామని తెలిపారు. అతని వద్ద వున్న40 లీటర్ల నాటు సారా, 800 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని తెలిపారు. సారా కాచి విక్రయిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఎస్వియు ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి తొలగింపు


ప్రజాశక్తి - క్యాంపస్ : సంఘ నిర్మాణానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ, వ్యక్తిగత నిర్ణయాలు తీసుకుంటూ సంఘ నిర్మాణానికి నష్టం కలిగిస్తున్నందుకు ఎస్వి యూనివర్సిటీ కార్యదర్శిగా పని చేస్తున్న పి సుందర్ రాజుని ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తూ ఏఐఎస్ఎఫ్ సంఘం నిర్ణయం తీసుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘ వ్యతిరేక చర్యలు ఎవరు చేసినా సహించేది లేదని లేదని ప్రాథమిక సభ్యత్వం నుంచి పూర్తిగా తొలగిస్తామని హెచ్చరించారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి: టిడిపి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తమను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని నగరి నియోజకవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. మున్సిపాలిటీలోని10వ వార్డులో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ ఉమ్మడి మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరిస్తూ, తమను గెలిపిస్తే పుత్తూరును అన్నీ రంగాల్లో అభివృద్ధి చేస్తానని, మౌలిక వసతులు కల్పిస్తానని హామీ ఇస్తూ ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమం లో టిడిపి వార్డు ప్రసిడెంట్ డి జి ధనపాల్, శ్రీనివాసులు, సాయి, మునేంద్ర, క్రిష్ణ చైతన్య, తిరిష్,నవీన్, టౌన్ ప్రెసిడెంట్ జీవరత్నం నాయుడు, ఎన్. ఎన్. ధనపాల్, షణ్ముగరెడ్డి పాల్గొన్నారు.

సిఆర్ఎస్ మజ్దూర్ యూనియన్ చైర్మన్‌గా సదాశివరెడ్డి

ప్రజాశక్తి -రేణిగుంట : సౌత్ సెంట్రల్ రైల్వే గ్యారేజ్ రిపేర్ షాప్ సీఆర్ఎస్ బ్రాంచ్ మజ్దూర్ యూనియన్ చైర్మన్‌గా సదాశివరెడ్డి బ్రాంచ్ సెక్రటరీగా బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారంక్యారేజ్ రిపేర్ షాప్‌లో ఉన్న సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ లో నూతన కమిటీ ఏర్పాటు చేశారు. సిఆర్ఎస్ మజ్దూర్ యూనియన్ సెక్రెటరీగా బాబు, చైర్మన్ గా సదాశివరెడ్డి, కోశాధికారిగా ముని కుమార్ యూనియన్ కార్యాలయంలో పూజ అనంతరం బాధ్యతలు స్వీకరించారు. సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ శంకర్రావు ఆదేశాలతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ ఆఫీసులో ఏర్పాటు చేసిన కమిటీ మీటింగ్‌లో సెక్రటరీ బాబు, చైర్మన్ సదాశివ రెడ్డి మాట్లాడుతూ సి ఆర్ ఎస్‌లో కార్మికులకు ఎటువంటి సమస్యలు ఎదురైనా తాము ముందుండి వారికి పరిష్కార మార్గాలు చూపుతామన్నారు. సీఆర్ఎస్ వర్క్ షాప్ రైల్వే కార్మికులు, సదాశివరెడ్డి, సెక్రటరీ బాబులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ అసిస్టెంట్ సెక్రటరీలు మునిరాధ, హేంద్రేపాల్, చంద్రశేఖర్ , వైస్ చైర్మన్లు చంద్ర నాయక్, తిలక్ కుమార్ రెడ్డి, గాండీవం, దిలీప్, మాజీ డివిజన్ సెక్రెటరీ సురేందర్ రెడ్డి, రిటైర్డ్ ఎంప్లాయిస్ మహిళా కార్మికులు పాల్గొన్నారు.



ఎన్నికల నిబంధనలు పకడ్బందీగా నిర్వహించాలి: ఎంపిడివో

ప్రజాశక్తి -కోట : రానున్న ఎన్నికల్లో నిబంధనలు పకడ్బందీగా చేపట్టాలని కోట ఎంపిడిఓ శంకరయ్య అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో మండల పరిధిలోని 21 పంచాయతీల సెక్రటరీలతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నీటి, విద్యుత్, ఫ్యాన్లు, తదితర సౌకర్యాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ సెక్రటరీలపై వుందన్నారు. అంతే కాకుండా వివాదాస్పదంగా ఉండే పలు పంచాయతీల్లో ఎన్నికల సమయాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా గ్రామస్థుల్లో చైతన్యవంతం తీసుకురావాలన్నారు. ప్రతి ఓటరూ నిర్భయంగా ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్నీ పంచాయతీల సెక్రటరీ లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఒంగోలు ఆవు మృతి

- దేశీయ ఆవులకు అందుబాటులో లేని వైద్యం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి మిట్టకు చెందిన మీనాక్షమ్మ మీనా చంద్రన్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రానికి చెందిన ఒంగోలు ఆవు బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఈ ఆవు నుంచి వచ్చే గోమూత్రం గోమాయంతో మీనాక్షమ్మ ప్రకృతి వ్యవసాయం చేసేవారు. ఉన్న ఆధారం హఠాత్తుగా మృతి చెందడంతో వ్యవసాయానికి గోమూత్రం కరువైందని మీనాక్షమ్మ వాపోయారు. ఆవుకు నాలుగు నెలల క్రితం ఒక దూడ పుట్టిందని, దాదాపు రెండు నుంచి రెండున్నర లీటర్ల పాలు ఇచ్చేదని తెలిపారు. ఐదు రోజుల క్రితం ఆవు అనారోగ్యానికి గురి కావడంతో దగ్గరలోని పశు వైద్యశాలలో మీనాక్షమ్మ సంప్రదించారు . అయితే సరైన మందులు లేని కారణంగా ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించారు. అయినా ఆవును బతికించుకోలేక పోయారు. ప్రకృతి వ్యవసాయం కోసం లక్షల ఖర్చు పెడుతున్న జిల్లా స్థాయి అధికారులు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. దేశవాళి గోవులు ఒంగోలు, గిరి, పుంగనూరు లాంటి పశువులకు సరిపడా వైద్య సేవలు ప్రభుత్వం వద్ద అందుబాటులో లేవు. 'దేశవాళి ఆవులు పెంచండి.. ప్రకృతి వ్యవసాయం చేయండి..' అంటున్న అధికారులు సైతం ఆవులు ఇప్పించక పోగా వైద్య సేవలు కూడా అందించకపోవడంతో రైతులు లక్షల రూపాయలు నష్టపోతున్నారు. ఈ విషయం ప్రభుత్వం గమనించి దేశీయ పశువులకు కావలసిన వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

సత్యవేడు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి

నూక తోటి రాజేష్ ఎన్నికల ప్రచారం



ప్రజాశక్తి- నారాయణవనం: స్థానిక మండల కేంద్రంలో ఉన్న పాలమంగళం ఉత్తరపు కండ్రిగలో సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సర్పంచ్ వైసిపి నాయకులు ఆయనకి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి మండల నాయకులు కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన అన్ని పథకాలను ప్రజలకు తెలియజేస్తూ మళ్లీ మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసేందుకు మనమంత సిద్ధమే అని ప్రచారం చేశారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి సమావేశానికి హాజరయ్యారని సస్పెండ్ అయిన వలంటీర్లు రాజేష్, ఎంపీపీ దివాకర్ రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. వీరికి రాజేష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

నోడల్ అధికారుల విధుల పురోగతిపై సమీక్ష

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

నోడల్ అధికారులు చేపట్టిన విధుల పురోగతిపై డిఆర్ఓ పెంచల కిషోర్ సమీక్షించారు. నివేదికలు ఎప్పటికప్పుడు అప్డేట్‌గా ఉండాలని, ఎన్నికల మార్గదర్శకాల మేరకు అందరూ నడుచుకోవాలన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా నోడల్ అధికారులతో డిఆర్ఓ సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడుతూ నోడల్ అధికారులు వారి అప్డేటెడ్ నివేదికలు రూపొందించి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని, ఎన్నికల కమిషన్ నుండి వచ్చే మార్గదర్శకాల మేరకు అందరూ నడుచుకోవాలి అని సూచించారు.

జోరు అందుకున్న టిడిపి ప్రచారం

ప్రజాశక్తి- పెళ్లకూరు: మండలంలోని పునబాక గ్రామంలో బుధవారం టిడిపి నాయకులు వి.హరిబాబు, టి.యుగంధర్, బెన్నీ, పోలయ్యల ఆధ్వర్యంలో తెలుగుదేశం ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే పరసా వెంకటరత్నం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు, శాసనసభ అభ్యర్థి నెలవల విజయశ్రీకి మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈసందర్భంగా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఈప్రాంత అభివద్ధి తెలుగుదేశంపార్టీ హయాంలోనే జరిగిందని, అందువలన మిమ్మల్ని ఓటు వేయమని అడిగే హక్కు మాకే ఉందని, ప్రస్తుతం రాష్ట్ర భవిష్యత్ యువత, మహిళల చేతిలో ఉందని మీరు ఆలోచించి అభివద్ధి వైపు నడవాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు మురళిరెడ్డి, మధు నాయుడు, జి.ప్రభావతమ్మ, జనసేన నాయకుడు ఉయ్యాల ప్రవీణ్, ఎన్.ప్రసాద్ నాయుడు, శ్రీపతి బాబు, ఓ.శేఖర్ నాయుడు, సునీల్, నాగేందర్ రెడ్డి, కె.శివకుమార్, శివ, మహిళా ఉపాధ్యక్షురాలు సుజాతమ్మ పాల్గొన్నారు.



గ్రామంలో మేనిఫెస్టోను వివరిస్తున్న విజయశ్రీ

వలసలను ఆదరించిన తిరుపతి

- రాజకీయ ఉద్దండులు ఇక్కడినుంచే
- ఆధ్యాత్మిక నగరంలో 'త్రిముఖ' పోటీ


తిరుపతి శాసనసభ నియోజకవర్గంలో ప్రస్తుతం 2,70,762 మంది ఓటర్లు ఉన్నారు. త్రిముఖ పోటీ నెలకొంది.

'నాన్'లోకల్‌గానే ఆరణిపై ముద్ర




చిత్తూరు సిట్టింగ్ ఎంఎల్ఏగా ఉన్న ఆరణి శ్రీనివాసులుకు జగన్మోహన్‌రెడ్డి ఈసారి టిక్కెట్‌ను నిరాకరించారు. దీంతో తిరుపతికి వలసొచ్చి జనసేన కండువా కప్పుకుని ఎన్నో అవాంతరాలు, వివాదాలను అధిగమించి తిరుపతిని అభివృద్ధి చేస్తానని జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాస్ ప్రచార బరిలో ఉన్నారు. కూటమిలోనే కుంపటి రగిలింది.. మొత్తం సద్దుమణిగేలా చేయడానికి అధినేతలు దిగిరావాల్సి వచ్చింది. ఎంత ప్రచారం చేసినా 'నాన్' లోకల్‌గానే ఆరణిపై ముద్ర ఉంది.

అభివృద్ధి పథంపై 'అభినయ్‌రెడ్డికి' అవినీతి మరక



వైఎస్ఆర్‌సిపి అధికారంలోకి వచ్చాక తిరుపతిలో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలకు బాటలు వేశారు. అదే సమయంలో అవినీతి అక్రమాలను మూటగట్టుకున్నారు. ప్రస్తుతం వైసిపి నుంచి భూమన కరుణాకర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో భూమన అభినయ్‌రెడ్డి బరిలో నిలిచారు. డిప్యూటీ మేయర్‌గా ఉన్నా ఏకఛత్రాదిపత్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీరి ఏలుబడిలో తిరుపతి అభివృద్ధి బాట పట్టిందనే చెప్పాలి. అయితే నిధుల వినియోగం, కాంట్రాక్టు పనుల్లో అశ్రిత పక్షపాతం, అవినీతి అక్రమాలు బహిరంగంగానే ఆరోపణలు ఉన్నాయి. టిడిఆర్ బాండ్ల జారీలో భారీ కుంభకోణం జరిగిందన్నది ప్రతిపక్షాల ఆరోపణ. తాజాగా ఆ బాండ్లను నిలిపివేయాలని పురపాలక రాష్ట్ర మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది.

ప్రజాపోరాటాలే ఊపిరిగా పి.మురళి



సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ప్రజాపోరాటాలే ఊపిరిగా అంచెలంచెలుగా ఆ పార్టీలో ఉన్నతస్థాయికి ఎదిగారు. ఇండియా వేదిక అభ్యర్థిగా సిపిఎం, కాంగ్రెస్ పార్టీల మద్దతుతో తిరుపతి అసెంబ్లీ బరిలో నిలిచారు. మురళి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శిగా, ఆటో యూనియన్ రాష్ట్ర నాయకులుగా ఉన్నారు. తిరుపతిలో ఆటో, హాకర్స్, బిల్డింగ్, మెడికల్, మున్సిపల్ కార్మికులతో పాటు వీధి విక్రయదారులు సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారు. జిల్లాల పునర్విభజన అనంతరం నూతనంగా ఏర్పడిన తిరుపతి జిల్లాకి సిపిఐ నుండి ప్రథమ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. లెనిన్ నగర్, ప్రగతి నగర్, వేదాంతపురం, బర్దన్ కాలనీల నిర్మాణంలో క్రియాశీలక పాత్ర వహించి వందలాది మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న బిజెపిని, ఆ పార్టీకి కొమ్ము కాస్తున్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలను ఓడించాలని, ఇండియా వేదిక అభ్యర్థిగా తనను గెలిపించాలని ప్రచారం చేస్తున్నారు.

రాజకీయ చరిత్ర పుటల్లో..

తిరుపతి నియోజకవర్గానికి 15 సార్లు జరిగిన సార్వత్రిక, ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఏడు సార్లు, టిడిపి అయిదు సార్లు, వైసిపి ఒకసారి, స్వతంత్ర అభ్యర్థి ఒకసారి, 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం అధినేత చిరంజీవి ఇక్కడి నుంచి విజయం సాధించారు. తదనంతర పరిణామాల్లో ప్రజారాజ్యంను కాంగ్రెస్‌లో విలీనం చేయడంతో ఆయనకు కేంద్ర మంత్రి పదవి దక్కింది. దీంతో..ఆయన తిరుపతి ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి భూమన కరుణాకర్ రెడ్డి గెలుపొందారు.

2014 ఎన్నికల నాటికి ఇక్కడ రాజకీయ సమీకరణల్లో మార్పులు జరిగాయి. 2014 ఎన్నికల్లో తిరుపతి నియోకవర్గంలో మొత్తం 2,90,107 ఓట్లు ఉండగా, అందులో 1,71,507 ఓట్లు పోలయ్యాయి. టిడిపి నుండి పోటీ చేసిన వెంకటరమణకు 99,313 ఓట్లు రాగా, వైసిపి నుండి పోటీ చేసిన కరుణాకరరెడ్డికి 57,774 ఓట్లు వచ్చాయి. టిడిపి అభ్యర్థి వెంకటరమణ 41,539 ఓట్ల మెజార్టీతో గెలపొందారు. అయితే, ఎన్నికైన కొద్ది కాలానికే వెంకటరమణ అనారోగ్యంతో మరణించారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన భార్య సుగుణమ్మ టిడిపి నుండి పోటీ చేశారు. వైసిపి పోటీ పెట్టలేదు. కాంగ్రెస్ అభ్యర్థిపై సుగుణమ్మ 1,16,524 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ఇది గతించిన చరిత్ర. 2018లో జరిగిన ఎన్నికల్లో స్వల్ప తేడాతో సుగుణమ్మ కరుణాకర్‌రెడ్డి చేతిలో ఓటమి పాలయ్యారు.

దొంగ ఓట్లను అడ్డుకుంటాం: ఆరణి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నియోజకవర్గంలో దొంగ ఓట్లను అడ్డుపెట్టుకుని గెలవాలని చూస్తున్నారని, తప్పకుండా దొంగ ఓట్లను అడ్డుకొని గెలుపొందుతామని ఉమ్మడి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి నగర పరిధిలోని జీవకోన ప్రాంతంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికంగా శివ అతని మిత్ర బందం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి జనసేన పార్టీలో చేరారు. వీరికి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జీవకోన ప్రాంతంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ఖాళీ అయిపోయిందన్నారు. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలు నచ్చి స్థానికంగా ఉన్న యువత పెద్ద సంఖ్యలో పార్టీకి అండగా నిలుస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, తిరుపతి నగరంలో పెచ్చు మీరిన గంజాయి అమ్మకాలను, భూకబ్జాలను, టిడిఆర్ బండ్ల భాగోతాలను తప్పకుండా బయటపెట్టి కారకులకు తగిన శిక్షలు పడేలా చేస్తామన్నారు. జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, రాజమోహన్, రాజేష్ యాదవ్, రాజశేఖర్ పాల్గొన్నారు.



జనసేన పార్టీలో చేరిన జీవకోన యువత

అధికార దాహంతోనే చంద్రబాబు దొంగ హామీలు



ప్రజాశక్తి - తిరుపతి సిటి: అధికార దాహంతోనే చంద్రబాబు నాయుడు దొంగ హామీలు ఇస్తున్నారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. 30వ డివిజన్ పరిధిలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నగర మేయర్ శిరీష వెంట రాగా, స్థానిక 30 వ డివిజన్ కార్పొరేటర్ కల్పనా యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానికులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. వీధి వీధిలో గజ మాలలువేసి, దుశ్శాలువలతో సత్కరించారు. భూమన కరుణాకర రెడ్డి ఇంటింటికీ కర పత్రాలు అందజేస్తూ ఫ్యాన్ గుర్తుకే ఓట్లు వేయాలని అభ్యర్థించారు. తిరుపతి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ ని ఆశీర్వదించాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



ఎస్వీ యూనివర్సిటీ, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం పరిశోధక విద్యార్థిని ఎన్. ఉమాదేవికు డాక్టరేట్ లభించింది. విశ్రాంత ఆచార్యులు బి.వెంకటచలపతి మార్గదర్శకత్వంలో ఏ స్టడీ ఆన్ వెస్ట్ మేనేజ్మెంట్ ఆఫ్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ చిత్తూర్ డిస్టిక్ ఇన్ ద స్టేట్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి దామ్లా నాయక్ తెలిపారు.

ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపుకార్డు చూపించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

సార్వత్రిక ఎన్నికలు - 2024లో ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చిన సమయంలో ఓటర్లు ఓటరు గుర్తింపు కార్డులను చూపించి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిక్ కార్డు లేని వారు ప్రత్యామ్నాయంగా ఫోటో గుర్తింపు కార్డులను చూపించి ఓటు వేయవచ్చన్నారు. ఎలక్షన్ కమీషన్ 1993, ఆగస్టు 28వతేదీన ఎలక్టర్ల ఫోటో ఐడెంటిటీ కార్డు ఈపిఐసిని ఎలక్టర్లందరికీ జారీ చేయాలని నిర్దేశిస్తూ ఆదేశాలు ఇచ్చింది. ఈ పి ఐ సి లభ్యంగా లేని ఓటర్లు ఈ క్రింది ప్రత్యామ్నాయ ఫోటో గుర్తింపు పత్రాలలో ఒక దానిని చూపించి వారి ఓటు హక్కును వినియోగించుకోవచ్చన్నారు. 12 రకాల గుర్తింపు కార్డులను సూచించారు.

ఇఫ్తారు విందులో అమర్‌నాథ్‌రెడ్డి



ప్రజాశక్తి- పలమనేరు: రంజాన్ పండుగ సందర్భంగా పలమనేరు నియోజకవర్గ ముస్లిం సోదర సోదరీమణులందరికీ శుభాకాంక్షలను మాజీ మంత్రి అమరనాథ రెడ్డి తెలియజేశారు. 30 రోజులు నిష్టతో ఉపవాస దీక్షలు చేపట్టి మంచి మనసుతో ఆ అల్లాను ప్రార్థించిన ప్రతి ఒక్కరికి శుభం కలగాలని అన్నారు. అనంతరం మండలంలోని ఫకీరుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు మండల టిడిపి నాయకులతో కలిసి ఆయన బుధవారం సాయంత్రం పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షులు నాగరాజు రెడ్డి, నాయకులు జగదీష్ నాయుడు, పెద్దబ్బ, మల్లేశ్వర్‌రెడ్డి, వెంకటమునిరెడ్డి, అమర్నాథ్ రెడ్డి,గిరి,, పాపిరెడ్డి, శీనురెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దపంజాణి: గంగమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్రమంతా వర్షాలు కురిసి రైతులంతా సుభిక్షంగా ఉండాలని గంగమ్మ తల్లిని కోరినట్లు మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అప్పినపల్లి గ్రామంలో గంగమ్మ జాతర కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు గ్రామస్తులు అపూర్వ స్వాగతం తెలియజేశారు. అమ్మవారిని దర్శించుకోగా నిర్వాహకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. మండల పార్టీ అధ్యక్షులు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చలపతి, పంచాయతీ పార్టీ అధ్యక్షులు రామకృష్ణ, శ్రీరాములు, మురహరి రెడ్డి,రామకృష్ణ,సురేష్, గోపాల్,నాగరాజు రెడ్డి, నందగోపాల్ పాల్గొన్నారు.

పార్థసారథి రెడ్డిని కలిసిన అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపంజాణి గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పలమనేరు నియోజకవర్గంలో పోటీ చేసిన పార్థసారథి రెడ్డిని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి బుధవారం ఆయన గ్రామంలోని వలసపల్లిలో స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజక వర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు గతంలో జరిగిన సంఘటనలను గురించి చర్చించారు.

ఎన్నికల విధులలో ఉన్న ఉద్యోగులకు

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం...



రాజకీయపార్టీల ప్రతినిధులకు పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని వివరిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లాలో ఎన్నికల విధులలో పాల్గొంటున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించడం జరుగుతుందని కలెక్టర్ ఎస్.షణ్మోహన్ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎస్పీ మణికంఠ, డిఆర్ఓ పుల్లయ్యలతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల విధులకు హాజరవుతున్న 12వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు మే 3వ తేదీ నుండి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈనెల 12న ర్యాండమైజేషన్ నిర్వహించనున్నట్లు తద్వారా పిఒ, ఎపిఒ, ఓపిఒలకు పోలింగ్ రోజున వారు పనిచేయవలసిన నియోజకవర్గం కేటాయించ బడుతుందని, సంబంధిత ఆర్ఓలు నిర్వహించే శిక్షణా కార్యక్రమాలకు వీరు హాజరు అవుతారని తెలిపారు. ప్రచారాలు నిర్వహణకు సంబంధించి వివరాలు అందిస్తూ సంబంధిత పోలీస్ స్టేషన్లలో అనుమతి పొందాలని తెలిపారు. దివ్యాంగులు, 85 సంవత్సరాల పైబడ్డ వారు ఇంటి వద్ద నుండి ఓటు వేసే ప్రక్రియకు సంబంధించి ఈ నెల 21 నుండి బిఎల్ఓల ద్వారా సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈవిధంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ నియమనిబంధనలు త్వరలో రానున్నాయని తెలిపారు. రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో తమ సమస్యలను కలెక్టర్ దష్టికి లేదా సంబంధిత నియోజకవర్గాల ఎన్నికల అధికారుల దష్టికి తీసుకురావాలన్నారు. బాణాసంచా నిషేధమని తెలిపారు. జిల్లా ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ వివిధ రాజకీయ పార్టీల వారు ప్రచారం గురించి సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు ముందస్తు సమాచారం అందించాలని, తద్వారా వివిధ పార్టీల వారు ఒకే ప్రాంతంలో ఒకే సమయంలో ప్రచారం నిర్వహించుకోకుండా తగిన సమయం సంబంధిత పోలీస్ అధికారులు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు 7 కంపెనీల ప్రత్యేక దళాలు రావడం జరుగుతుందని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలలో నిరంతరం పరిశీలనతో పాటు పెట్రోలింగ్ కూడా నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో రాత్రి వేళల్లో పెట్రోలింగ్ వ్యవస్థ నిర్వహించడం జరుగుతున్నదని, జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సమిష్టి గా పూర్తి సహకారం అందివ్వాలని తెలిపారు. బిజెపి ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, కాంగ్రెస్ ప్రతినిధి పరదేశి, సిపిఎం ప్రతినిధి వాడ గంగరాజు, సయ్యద్, వైసిపి ఉదయ్, ప్రతాప్ టిడిపి ప్రతినిధులు సిఆర్.రాజన్, సురేంద్ర కుమార్, గోవిందం యాదవ్, రాజేష్ పాల్గొన్నారు.

మరింత అభివృద్ధి చేస్తాం: డిప్యూటీ సీఎం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ఎన్నికల్లో తన కుమార్తెను జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కోరారు. బుధవారం మండలంలోని పెద్దకాల్వ పంచాయతీలో స్థానిక సర్పంచ్ ఏకాంబరం ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ దఫా ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని డిప్యూటీ సీఎం అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబురెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, హరిబాబు, గుణశేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సురేందర్ రెడ్డి, గోవింద్ రెడ్డి, కోదండన్, కుట్టి పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

నేడు వైఎస్సార్‌సీపీ బహిరంగ సభ



ప్రజాశక్తి- పెద్దపంజాణి: 11వ తేదీ గురువారం మండల కేంద్రంలో జరగనున్న వైఎస్ఆర్‌సిపి భారీ బహిరంగ సభను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే వెంకటే గౌడ మండల నాయకులను కోరారు. బుధవారం మండల నాయకులు, కార్యకర్తలను కలుసుకొని లింగాపురం వద్ద బహిరంగ సభకు కావలసిన ఏర్పాట్ల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని వైయస్సార్సీపి నాయకులు, కార్యకర్తలతో నేడు 10.30 గంటలకు పెద్దపంజాణి ఉన్నత పాఠశాల పక్కనున్న మైదానంలో జరగనున్న వైఎస్ఆర్‌సిపి భారీ బహిరంగ సభకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హాజరవుతారని మండలంలోని నాయకులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు హాజరు అవ్వాలని కోరారు. ఎంపిపి రెడ్డప్ప, మండల కన్వీనర్ బాగారెడ్డి, సర్పంచులు ఎంపిటిసిలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీఎంల ర్యాండమైజేషన్‌కు

పటిష్ట ఏర్పాట్లు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్ ఈవీఎంల ర్యాండమైజేషన్ కోసం పటిష్టమైన ఏర్పాట్లను చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్. షన్మోహన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌ను ఈవీఎంల ర్యాండమైజేషన్ నిమిత్తం చేపట్టవలసిన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ మణికంఠ, రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా భద్రతా చర్యలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట బందోబస్తు నిత్యం కొనసాగాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 12వ తేదీ నుంచి చేపట్టే ఈవీఎంల ర్యాండమైజేషన్ కోసం ఏర్పాట్లను జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ఈవీఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ కోసం పకడ్బందీగా భద్రత ఏర్పాట్లు ఉండాలన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలకు విడివిడిగా ఈవీఎంల ర్యాండమైజేషన్ చేసేందుకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.పుల్లయ్య, బిజెపి ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, కాంగ్రెస్ ప్రతినిధి పరదేశి, సిపిఎం ప్రతినిధి వాడ గంగరాజు, సయ్యద్, వైఎస్ఆర్‌సిపి ప్రతినిధి ఉదయ్, ప్రతాప్ టిడిపి ప్రతినిధులు సి.ఆర్ రాజన్, సురేంద్ర కుమార్, గోవిందం యాదవ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మీ ఇంటి బిడ్డను.. ఆశీర్వదించండి : ఆర్కే రోజా

ప్రజల మేలు కోరే పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్
టీడీపీ సూపర్ సిక్స్ అంటూ సూపర్ జిమ్మిక్స్ చేస్తోంది

ప్రజాశక్తి- చిత్తూరుడెస్క్: మీలో ఒక వ్యక్తిని.. మీ ఇంటిబిడ్డనైన నన్ను ఆశీర్వదించండి అంటూ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. బుధవారం మండలంలోని భీరకుప్పం పంచాయతీలో ఆమె ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులు ఆమెకు అపూర్వ స్వాగతం పలికారు. ప్రతి ఇంటికి వెళ్లి అభివృద్ధిని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ద్వారా అందించిన సంక్షేమాన్ని కళ్లకు కట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజమైన ప్రజాసేవ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. మన రాష్ట్రాన్ని, మన నియోజకవర్గాన్ని మన ప్రాంతాన్ని, మన గ్రామాన్ని ఏ ప్రభుత్వమైతే అభివృద్ధి చేసిందో ఆ ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఎప్పుడూ ఉంటుందని ప్రజలు నిరూపించాలన్నారు. పంచాయతీలోని కావేటిపురం దళితవాడకు మూడు తరాలుగా లేని రోడ్డును ప్రస్తుతం వేయడం జరిగిందన్నారు. వరద సమయంలో రోడ్డు కొట్టుకుపోతే యుద్ధప్రాతిపదికన సరిచేశామన్నారు. శ్మశానాలకు దారివసతి కల్పించడం జరిగిందన్నారు. 2019 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కూడాముఖ్యమంత్రి అమలుచేశారని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందుతోందన్నారు.



టీడీపీ సూపర్ సిక్స్ అంటూ సూపర్ జిమ్మిక్స్ చేస్తోంది

చంద్రబాబు నాయుడు 2014లో 600లకు పైగా హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని కూడా అమలుచేయలేదని గుర్తుచేశారు. ప్రస్తుతం సూపర్ సిక్స్ అంటూ కొత్తగా ఏమార్చడానికి విచ్చేశారన్నారు. నమ్మి వెళ్లారంటే బంగారు కడియంకోసం వెళ్లి పులికి ఆహారమైన కథ లెక్కే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, డిల్లి, ఎంపీటీసీ తులసీచంద్ర రెడ్డి, సర్పంచ్ మునస్వామి, మాజీ సర్పంచ్ ఏలుమలై రెడ్డి, వైస్ సర్పంచ్ దేవరాజులు, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, నాయకులు జగన్మోహన్ రెడ్డి, నాయకులు శశికుమార్, విజయ్, చంద్రారెడ్డి, రామచంద్ర, నాగభూషణం, హెన్రీ, పళని, సుమన్, వెంకటేష్, గోవర్ధన్ పాల్గొన్నారు.

టిటిడి విశ్రాంత ఉద్యోగి బొజ్జా రెడ్డికి నివాళి

ప్రజాశక్తి -రామచంద్రాపురం : తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలం, రేఖల చేను గ్రామానికి చెందిన రిటైర్డ్ టీటీడీ అటవీశాఖ ఉద్యోగి బోడి రెడ్డి బొజ్జా రెడ్డి మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం రేఖలచేను గ్రామంలో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, టిటిడి ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు నాగార్జున, టిటిడి ఎంప్లాయిస్ అసోసియేషన్ లీడర్ గుణశేఖర్, టిటిడి పెన్షన్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ మునిరాజ, తదితరులు బొజ్జా రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొజ్జా రెడ్డి టీటీడీలో పనిచేసినన్ని రోజులు ఎంతో నిబద్ధతతో, క్రమశిక్షణతో పనిచేశారని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో అనేకమంది టీటీడీ ఉద్యోగులు, పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.



బొజ్జారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు కందారపు మురళి

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలో బుధవారం ఉదయం ఎంఇవో ముని సుబ్రహ్మణ్యం పలు పాఠశాలలను పర్యవేక్షించారు. నెలవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెస్ట్ వర్ధూరు పాఠశాల, బిచ్చగాడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆ పాఠశాలలో పిల్లలు ప్రార్థన సమయంలో సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనిఖీ నిర్వహించి మధ్యాహ్నం పొంగలి, కోడి గుడ్డు కుర్మా రుచి చూశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. విద్యార్థులకు రుచికరం తోపాటు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం వడ్డించాలని సూచించారు. హాజరు శాతం తగ్గకుండా ఉండాలని, డ్రాప్ అవుట్ లేకుండా చూడా లని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యా యులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

'వాహనాలు తుప్పు పడుతున్నా పట్టించుకోరా?'

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాల్టీకి మూడు నెలల క్రితమే మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం కార్మికుల పని భారం తగ్గించేందుకు 13 మినీ బ్యాటరీ ఆటోలను ప్రభుత్వం అందించి మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. వాటిని ఉపయోగించకుండా మూలన పడేశారని సిపిఐ పట్టణ కార్యదర్శి డి మహేష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్రికలకు ప్రకటనలు తప్ప మున్సిపల్ అధికారులు కార్మికులకు అందించకుండా మూడు నెలలుగా వాహనాలను నిరుపయోగంగా పడేశారని పేర్కొ న్నారు. దీనిపై కమిషనర్ స్పందించి కార్మికులకు పని భారం తగ్గించాలని ఆయన కోరారు.

టీడీపీలో చేరిక

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ శ్రీకాళహస్తి టీడీపీలో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. ఇందులో భాగంగానే బుధవారం శ్రీకాళహస్తి మండలం ఓబులాయపల్లి, గిరిజన కాలనీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో వెర్రి శ్రీనివాసులు, వెర్రి ప్రసాద్, వెర్రి గేరటయ్య, వెర్రి బలరామ్, లక్ష్మయ్య, చిన్నయ్య, వెంకటమునినాయుడు, పాపిరెడ్డి, వెంకటరమణ రెడ్డితో పాటు మరో 30 మంది ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న ఆరాచకాలు, ఎమ్మెల్యే చేస్తున్న దౌర్జన్యాలను భరించలేక బొజ్జల గోపాల కృష్ణారెడ్డి పాలన కోసం బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి మద్దతు తెలుపుతూ ఆయన గెలుపు కోసం కృషి చేయడానికి పార్టీలో చేరామన్నారు.

రేణిగుంట : శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సమక్షంలో పట్టణానికి చెందిన వైసిపి నాయకులు బుధవారం టిడిపిలో చేరారు. పట్టణ టిడిపి యువ నాయకుడు ఎంజి రెడ్డి, మాజీ సర్పంచ్ జ్యోతి నారాయణ మర్యాద పూర్వకంగా బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఎంజి రెడ్డి, జ్యోతి నారాయణ ఆధ్వర్యంలో నియోజకవర్గ యువ నాయకుడు కన్నాలి మోహన్ రెడ్డి సహకారంతో వైసిపి సీనియర్ నాయకులు టైలర్ నరసింహులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ నరసింహులు రెడ్డి పట్టణానికి చెందిన చిన్న, కిషోర్, ముఖేష్ తేజ, సురేష్ కుమార్, మురళీకృష్ణ టిడిపిలో చేరారు.

రామచంద్రాపురం: రామచంద్రాపురంలో టిడిపి నూతన కార్యాలయాన్ని చంద్రగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా కష్టపడి టిడిపిని మెజార్టీ గెలిపించాలని పులివర్తి నాని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం తిరుమలరెడ్డి, జనార్ధన్ చౌదరి, మధుసూదన్ రెడ్డి, వాసు యాదవ్, నాగభూషణం యాదవ్, జీవ రత్నం యాదవ్, కె ధనుంజయ రెడ్డి, కే నరసింహారెడ్డి, గిరిధర్ రెడ్డి పాల్గొన్నారు.చంద్రగిరి టౌన్ కు చెందిన మాజీ ఎంపీటీసీ నవనీతమ్మ, మునిరామి రెడ్డి, అరుణ, చెంగమ్మ, ధనలక్ష్మి, గంగా, లతా మరి కొందరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో బుధవారం టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వి సుబ్రహ్మణ్యం నాయుడు, గౌస్ బాషా, రమేష్ రెడ్డి, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులు తరచూ ద్రవ పదార్థాలు తీసుకోవాలి

ప్రజాశక్తి -దొరవారిసత్రం : వేసవి తీవ్రతకు గురి కాకుండా ప్రతి గర్భవతి తరచూ ద్రవ పదార్థాలు తీసుకోవాలని డాక్టర్ చంద్రకళ గర్భిణులకు సూచించారు. దొరవారిసత్రం పిహెచ్‌సిలో బుధవారం నిర్వహించిన పిఎం ఎస్ఎంఎస్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులను పరీక్షించారు. వారికి హిమోగ్లోబిన్ శాతం, బ్లడ్ ప్రెషర్, షుగర్, హెచ్‌బిఎస్ ఏజ్ వంటి పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. గత మాసంలో, ఈ నెలలో చేసిన హెచ్ బి పరీక్షలకు వ్యత్యాసం ఉండడంతో సరియైన పద్ధతిలో ఐరన్ మాత్రలు వేసుకుంటూ, రక్త వృద్ధికి దోహదపడే ఆకు కూరలు అత్యధికంగా తీసుకోవాలని సూచించారు. వేసవి కావడంతో శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఆరోగ్యానికి అవసరమైన ద్రవ పదార్థాలు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్, షుగర్ లేని పండ్ల రసాలు తరచూ తీసుకోవాలని తెలిపారు. నడక, వ్యాయామం అలవరుచుకోవాలని వారికి సూచించారు. ప్రతి మాసంలో ఆరోగ్య స్థితి, బిడ్డ పెరుగుదల, కదలికలను పరీక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ సంపూర్ణమ్మ, పిహెచ్ ఎన్ పద్మావతి, హెచ్‌వి మైథిలి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు

దూర ప్రాంతాలకు వెళ్లేవారు సమాచారం అందించాలి: ఎస్ఐ



ప్రజాశక్తి -బుచ్చినాయుడు: వేసవి కాలంలో మండలం నుండి సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లే వారు తమకు సమాచారం అందించాలని బుచ్చినాయు డు కండ్రిగ ఎస్ఐ వెంకట నరసింహం ఈ సందర్భంగా మాట్లాడు తూ వేసవి సెలవుల్లో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళుతుంటారని, శుభకార్యాలకు వెళుతుంటారని అలాంటి సందర్భాల్లో తమకు సమాచారం ఇవ్వాలని వారి తెలిపారు. మరోవైపు వ్యాపారులు తమ వ్యాపార కార్యకలాపాల తర్వాత దుకాణాలకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు దుకాణాలలో నగదు, విలువైన వస్తువులు ఏది ఉంచకూడదని తమతో పాటు తీసుకుని వెళ్లాలని ఆయా దుకాణాల వద్ద సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసుకొని పోలీసులకు సహకరించాలని సరిహ ద్దు మండలం కావడంతో సరిహద్దు ప్రాంతాలలో నిఘా పెట్టామని ప్రజలు కూడా సహకరించాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కన బడితే వెంటనే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో తమ పిల్లలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలని చెడు అలవాట్లకు, వ్యసనాలకు బానిసలు కాకుండా ఎండలకు సేద తీరడానికి విహారాం అంటూ వెళ్లి ప్రమాదాలకు కాకుండా తగు జాగ్రత్తలు తీసుకునేటట్టు సూచనలు ఇవ్వాలని ముఖ్యంగా పిల్లలు క్రీడలు ఆడే సమయంలో ప్రమాదాలకు గురి అవుతుంటారని తల్లిదండ్రులు ఎల్లప్పుడూ తమ పిల్లలకు కౌన్సిలింగ్ ఇస్తూ ఉండాలని తెలిపారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి


ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుతంగా వినియోగించుకోవాలని రెవెన్యూ తహశీల్దారు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ పి ఉషారాణి అన్నారు. ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ బుధవారం మండలంలోని సిద్దేశ్వర ఎస్టి కాలనీ, వెంకట్రామాపురం, బ్రాహ్మణ కాల్వ, సొరకాయల పాలెం, ఏడిమల్లలలో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేయాలని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే అవకాశం ఒక్క ఓటుకు మాత్రమే ఉంటుందన్నారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణమ్మ, విఆర్వోలు సతీష్, ప్రసాద్ సొరకాయల పాలెం సచివాలయం సిబ్బంది, విఆర్ఏ వెంకటేష్, బిఎల్వోలు గ్రామస్తులు పాల్గొన్నారు.



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న ఎన్నికల రిటర్నింగు అధికారి ఉషారాణి

ప్రజా సంక్షేమమే ధ్యేయం: టిడిపి

ప్రజాశక్తి - బాలాయపల్లి : ప్రజా సంక్షేమమే టిడిపి లక్ష్యంగా పనిచేస్తుందని ఆ పార్టీ స్థానిక ప్రధాన కార్యదర్శి కూను శ్రీహరి పేర్కొన్నారు. మండల కేంద్రంలో సత్యం నాయుడు ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికీ టిడిపి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం గురించి ఆలోచించి వారికి కావలసిన సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఘనత టిడిపికే ఉందన్నారు. ఈ ఐదేళ్లలో వైసిపి బడుగు బలహీన వర్గాల పైనే దాడులు చేసిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కావా లన్నా, నిరుద్యోగ భృతి కావాలన్నా, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు రావాలన్నా టిడిపి విజయం సాధించా లన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయ కులు ప్రసన్న పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

బిఎల్‌వోల అత్యవసర సమావేశం

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని తహశీల్దారు కార్యాలయంలో బుధవారం ఉదయం తహశీల్దారు ఆలీఖాన్, బిఎల్వోలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో భాగంగా ప్రతి పంచాయతీలో ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్‌ల్లో నీటి వసతి విద్యుత్ వసతి పారిశుద్ధ్యంలో అన్ని సక్రమంగా ఉండేలా చూడాలని , పోలింగ్ బూత్ బిల్డింగులు ఎలాంటి స్థితిలో ఉన్నాయి? తనకు తెలపాలని ప్రతి ఒక్కరూ ఎలక్షన్ అయ్యే వరకు బాధ్యతతో పనిచేయాలని బిఎల్వోలకు పోలింగ్ బూత్‌లు అప్పగించారు. ఆ బూత్‌లలో పరిశుభ్రతను, అక్కడ వసతులను శుభ్రంగా ఉంచేలా చూడాలని అక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జాగ్రత్తగా చూసుకోవాలని సలహాలు సూచనలు ఇచ్చారు, ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు చంద్రబాబు నాయుడు, సీనియర్ అసిస్టెంట్ నాగార్జున రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు కిరణ్ గురునాథ్ బిఎల్వోలు పాల్గొన్నారు.

గీజర్స్ వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రొటేరియన్ వజ్రాల శివరామరెడ్డి దాతృత్వంతో గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో అప్పుడే పుట్టిన నవ శిశువులకు వేడి నీళ్లతో స్నానం చేసేందుకు అవసరమైన సుమారు 20,000 రూపాయల విలువైన రెండు గీజర్లును హాస్పిటల్ డాక్టర్ రాజా కి బుధవారం అందించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో అనేక వసతులు, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని తెలిపారు. నవ శిశువుల కోసం గీజర్స్ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, స్వరూప్, ముని గిరీష్ దశరథరామిరెడ్డి, పివి కృష్ణయ్య, ఆర్ ఎం ఓ రవికుమార్ ,ల్యాబ్ టెక్నీషియన్ మౌలాలి, హెడ్ నర్స్ గౌరీ , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీజ డెయిరీ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: కేవిబిపురం మండలంలోని రాజుల కండ్రిగ గ్రామంలో శ్రీజ డెయిరీ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం బుధవారం ఏర్పాటు చేశామని డాక్టర్ హరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో పశువులకు వడదెబ్బ తగలకుండా రైతులు తగు జాగ్రత్త తీసుకోవాలన్నారు. పశువులను మంచి ఎండలో మేతకు తీసుకుని వెళ్లకూడదని చల్లటి ప్రదేశంలో కట్టి మేత పెట్టాలని రెండు గంటలకు ఒకసారి పశువులకు నీరు తాగించాలని సూచించారు. పశువులను ప్రతిరోజూ మంచినీటితో కడగాలన్నారు. అనంతరం పశువులను పరిశీలించి వాటికి సరిపడ మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పాల్గొన్నారు.

టిడిపి నాయకునికి పరామర్శ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాలిటీ టిడిపి నాయకులు జి బాబు అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉండి చికిత్స పొందాడు. అనంతరం ఇంటికి చేరుకున్న అతని వద్దకు నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ఆయన గృహంలో వెళ్లి పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: కెవిబిపురం మండలంలోని ఆరోగ్య కేంద్రంలో రోగులకు వడదెబ్బపై అవగాహన కలిగించారు . ఈ సందర్భంగా డాక్టర్ కటారి కుమార్ మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల ప్రతి ఒక్కరూ ఇళ్ల దగ్గరే ఉంటూ ఎక్కువ నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదన్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే బయటికి రావాలన్నారు. బయటికి వెళ్లేటప్పుడు చెప్పులు, గొడుగు, వాటర్ బాటిల్ తీసుకుని వెళ్లాలని సూచించారు. వడదెబ్బ తగిలిన వ్యక్తికి విపరీతమైన తలనొప్పి, వాంతులు అవు తాయని, నీరసంగా ఉండడం వంటి లక్షణాలు కనిపి స్తాయని తెలిపారు. వెంటనే ఇలాంటి వారు సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న డాక్టర్ దివ్య

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని తూగుం ద్రం పీహెచ్‌సీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వ ర్యంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ దివ్య, రెడ్‌క్రాస్ మండల అధ్యక్షులు పాపిరెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ లికిత, సిబ్బంది శాంతి, కృష్ణమ్మ పాల్గొన్నారు.

సంకల్పబలంతో ముందుకు సాగాలి..

ప్రజాశక్తి-పూతలపట్టు: విద్యార్థులు సంకల్పబలంతో ముందుకు సాగాలని ఎంఈవో కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఘనంగా జరిగిన వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సెలవుల్లో విద్యార్థులు తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు. విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: గర్భిణీలు తప్పని సరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అనురాధ, డాక్టర్ విజయ్‌చంద్ర, డాక్టర్ శాలిని తెలిపారు. బుధవారం ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేశారు. అనంతరం అవగాహన కల్పించారు. మహతి ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో గర్భిణీలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మారుతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు, వారి సిబ్బంది పాల్గొన్నారు.

సోమల: గర్భవతులు తప్పనిసరిగా వైద్యుల సూచనలు పాటించాలని పెద్ద ఉప్పరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సోనియా అన్నారు. బుధవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభయాన్ కార్యక్రమం కింద గర్భవతులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతినెల గర్భవతులు వైద్యుల వద్ద చెక్ అప్ చేయించుకోవాలని, వెయ్యి రోజుల పాటు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోకపోవడం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు.

వలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని దేవదొడ్డి పంచాయతీకి చెందిన 15మంది వాలంటీర్లు బుధవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు.

సోమల: మండలంలోని ఆరు పంచాయతీలకు చెందిన 42మంది వాలంటీర్లు తమ వ్యక్తిగత కారణాలవల్ల ఆయా పంచాయితీ కార్యదర్శులకు రాజీనామా లేఖలు అందజేసినట్లు ఎంపీడీవో నారాయణ తెలిపారు.

రాజకీయ పక్షాలు

నియమావళి పాటించాలి: ఆర్‌వో



మాట్లాడుతున్న ఆర్‌వో వెంకట శివ

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: శాసనసభ, పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేస్తున్న రాజకీయ పక్షాలు ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలని జీడీ నెల్లూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వెంకటశివ అన్నారు. బుధవారం జీడీ నెల్లూరు తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ నేతలతో ఆయన మాట్లాడుతూ అనుమతి తీసుకున్న వాహనాలతో మాత్రమే ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు. లేనట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవి, నాయకులు పాల్గొన్నారు.

చెత్త డంపు..

అక్కడంతా కంపు..!

- చిత్తూరులోని 50 డివిజన్ల చెత్తంతా అక్కడికే..
- తీవ్ర కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న ఒబనపల్లి వాసులు
- విషవాయువులు వ్యాప్తి చెంది అనారోగ్యపాలవుతున్న ప్రజలు
- పాలకులు మారుతున్నా పట్టించుకోవడం లేదని విమర్శలు
- చిత్తూరులో తీరని సమస్యగా డంపింగ్ యార్డ్ తరలింపు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగర పాలక సంస్థలో ఆవాసాల మధ్య ఉన్న డపింగ్ యాడ్ సమస్య ఏండ్ల తరబడీ తీరని సమస్యగా మిగిలిపోయింది. పార్టీలు మారిన పాలకులు మారిన డపింగ్ యాడ్ పరివాహక ప్రాంతంలో ఉన్న రెండు వేల జనాభాకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎన్నికల సందర్బాల్లో ఓట్ల లబ్దికోసం మార్చేస్తామని హామీలు ఇస్తున్నా.. గెలిచిన తరువాత పట్టించుకోకపోవడంతో డపింగ్ యాడ్ చుట్టూ ఉన్న ప్రజలు దుర్గదం(కంపు) వృద్దులు, చిన్నపిల్లలు, గర్బిణీలు, శ్వాసకోస వ్యాధి గ్రస్తులు అనేక ఇబ్బందులు పడుతూ నెట్టుకొస్తున్నారు. అడపా దడపా మార్చే ప్రయత్నం చేసినా ఎక్కడి మార్చాలనేది ప్రధాన సమస్య ఎదురౌతోంది.

మునుపెన్నడో చిత్తూరు పంచాయితీగా ఉన్న కాలంలో ఒబనపల్లి వద్ద 15ఎకరాల ఖాళీ స్థలంలో చెత్తను వేసే ప్రక్రియ ప్రారంభించారు. మున్సిపాలిటీ, కార్పొరేషన్‌గా మారినా ఇదే స్థలంలో డపింగ్ యాడ్ వంద సంవత్సరాలకు పైగా కొనసాగుతోంది. నగరం విస్తరించింది. డపింగ్ యాడ్ చుట్టూ మంగసముద్రం హౌసింగ్ కాలనీ ఏర్పడింది. నగరంలోని పేదలు, ఆటో, హమాలీ ఇతర కార్మికులకు ఈ ప్రాతంలో ప్రభుత్వమే ఇండ్ల స్థలాలు మంజురు చేసింది. ప్రస్తుతం నగర జనాభా రెండు లక్షలకు పై మాటే 50డివిజన్లలో సేకరిస్తున్న చెత్తను ప్రతి రోజూ ట్రాక్టర్లు, టిఫర్ల ద్వారా ఆ ప్రాంతాని తరలిస్తుంటారు. రోజుకు 20 నుంచి 30టన్నుల చెత్తను డపింగ్ యాడ్‌కు తరలిస్తున్నారు. ఇలా తరలించే వ్యర్థపదార్థలు డపింగ్ యాడ్‌లో గుట్టలుగా పెరుకుపోంది. ఏటా వర్షాకాలంలో డపింగ్‌యాడ్ చుట్టుఉన్న ప్రజలు ఈ డపింగ్ యాడ్ నుంచి వచ్చే కంపు



తగలబడుతున్న డంపింగ్ యార్డు, మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది(ఫైల్)

భరించలేకపోతున్నారు. అప్పుడప్పుడు డపింగ్ యాడ్ తగలబడితే అందులోంచి వచ్చే ఘాటైన పొగవల్ల చిన్నపిల్లలు, వృద్దులు, గర్భిణీలు, శ్వాసకోస వ్యాధిగ్రస్తుల ఇబ్బందులు వర్ణణాతీతం.

సమస్య ఎప్పటికి తీరేనో..

ఆవాసాల మధ్య ఒబనపల్లి వద్ద 15ఎకరాల్లో ఉన్న డపింగ్ యాడ్‌ను మార్చాలని ఇక్కడి సంతపేట, ఓబనపల్లి, మంగసముద్రం, తిమ్మసముద్రం వాసులు కోరుతన్నారు. అనేక సందర్భాల్లో ఆందోళనలు చేశారు. ఈ ప్రాంతాల్లో పర్యటించే రాజకీయ నేతలకు మొరపెట్టుకున్నారు. గత టీడీపీ ప్రభుత్వం చిత్తూరు రూరల్ మండలం మూడో గేటు బండపల్లి వద్దకు మార్చేందుకు నాటి కమిషనర్ ఓబులేసు ప్రయత్నం చేశారు. అక్కడి ప్రజలు అడ్డుకొని కోర్టును ఆశ్రయించడంతో డపింగ్‌యాడ్ మార్పు ప్రయత్నలు బెడిసికొట్టాయి. ప్రస్తుతం అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు అధికారంలోకి వచ్చిన వెంటనే డంపింగ్ యార్డు మారుస్తామంటూ హామీలు ఇస్తున్నారు.

అగ్ని ప్రమాదం..

మూడు రోజుల క్రితం డపింగ్‌యాడ్‌లో మంటలు చెలరేగి దట్టమైన పొగ కమ్ముకుంది. పరిసర ప్రాంతాల్లోని 200కుటుంబాలను ఖాళీ చేయించి సమీపంలో ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో నగర పాలక సంస్థ తాత్కాలిక ఆశ్రయం ఏర్పాటు చేసింది. మంటలను అదుపు చేసేందుకు నాలుగు అగ్నిమాపక వాహనాలు, ఐదు వాటర్ ట్యాంకులను ఉపయోగిస్తే మూడు రోజులకు మండలు అదుపులోకి వచ్చాయి. ప్రతి ఏటా ఇదే పరిస్థితంటూ స్థానికులు తాము పడుతున్నట్లు కష్టాలు తీర్చాలని కోరుతున్నారు. వర్మీకంపోస్టు యూనిట్, ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇలా అనేక మార్పులు చేస్తున్నా డపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్గదం ఆపడం సాధ్యం కావడం లేదు. ఈ చుట్టు ప్రాంతాల్లోని ఉన్న ప్రజలు శ్వాసకోస వ్యాధుల భారినపడుతున్నారు. చిత్తూరు నగరవాసుల సమస్యలను తీర్చేలా నగర పాలక సంస్థ, ప్రజా ప్రతినిధులు డపింగ్ యాడ్ మార్పు చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు నియోజకవర్గం పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. అక్కడ మౌలిక సదుపాయలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కేంద్రాల్లో విద్యుత్, ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు, వీల్ చైర్స్, ర్యాంపులు, ఇంటర్‌నెట్ వంటి సదుపాయాలు సిద్ధం చేయాలన్నారు. చిన్నచిన్న మరమ్మతులు ఉంటే వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట చిత్తూరు నగరపాలక కమిషనర్ డాక్టర్ అరుణ, తహశీల్దార్ శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

ఆంగ్లభాషపై పట్టు సాధించేందుకే టోఫెల్ పరీక్ష



ప్రజాశక్తి-సోమల: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని మూడు, నాలుగు, ఐదు తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఆంగ్ల భాషపై నైపుణ్యం పెంచేందుకే టొఫెల్ పరీక్షను ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎంఈవో శివరత్నమ్మ అన్నారు. బుధవారం మండలంలోని 14ప్రాథమిక పాఠశాలలో టొఫెల్ పరీక్షను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నిర్వహించగా ఎంఈఓ తనిఖీ నిర్వహించారు. ప్రభుత్వం అందించిన స్మార్ట్ టీవీల ద్వారా విద్యార్థులకు పరీక్ష విధి విధానాలను ఎలా రాయాలి అన్న విషయాలను చూపించి తదనంతరం విద్యార్థుల చేత పరీక్ష రాయించారు.

వడగాల్పుల పట్ల అప్రమత్తత అవసరం: డాక్టర్ రవిరాజు

ప్రజాశక్తి-కార్వేటినగరం:

అధిక ఉష్ణోగ్రత వల్ల ఏర్పడుతున్న వలగాల్పుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. బుధవారం మండలంలోని ఈదువారిపల్లి సబ్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకి వాతావరణంలో ఉష్ణోగ్రత పెరుగుతుండటం వల్ల ఆనారోగ్య సమస్యలు ఏర్పడుతుందన్నారు. గత వారం రోజులుగా ఉష్ణోగ్రత మరింత పెరిగిందని, వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు, ఉపాధీహామీ కూలీలు అమ్రత్తంగా ఉండాలన్నారు. 11గంటల లోపే వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి చేరుకోవాలన్నారు. బాట సారులకు గొడుగు తప్పనిసరని, వ్యవసాయ పనుల నుంచి ఇంటికి చేరుకున్న వారు ఓఆర్ఎస్ తప్పక తీసుకోవాలని సూచించారు. అలాగే కనీసం మంచి నీళ్లతో పాటు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, పళ్ల రసాలను అధికంగా తీసుకోవాలని సూచించారు. విరేచనాలతో కూడిన వాంతులు




సూచనలు ఇస్తున్న డాక్టర్ రవిరాజు

వంటి లక్షణాలు కనిపించినప్పుడు వెంటనే పడదెబ్బగా గుర్తించి వారిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాలన్నారు. వృద్ధులు, చంటి పిల్లలు, గర్భవతులు, బాలింతలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది వడదెబ్బ లక్షణాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఆరోగ్య ఉప కేంద్రానికి సబంధించిన రికార్డులను పరిశీలించారు.

అదిగో.. నెలవంక

- నేడు రంజాన్ వేడుకలు
- అన్ని మసీదుల వద్ద ఏర్పాట్లు పూర్తి



సోమల వద్ద కనిపిస్తున్న నెలవంక

ప్రజాశక్తి-సోమల: రంజాన్ పురస్కరించుకొని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపడుతున్నారు. గురువారం రంజాన్ పండుగ నేపథ్యంలో అంతటా మసీదుల్లో ముమ్మరంగా ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. బుధవారం సాయంత్రం 6.40 గంటలకు ఆకాశంలో నెలవంక కనిపించింది.

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ముస్లింలు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఈ సందర్భంగా మండలంలో తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ గ్రామం అజాఖానా జహరాలో ఖురాన్‌లోని భక్తి సందేశాన్ని, అదేవిధంగా ఈద్గా వద్ద ఉపవాసం గురించి చిత్తూరు డివిజన్ ప్రభుత్వ ఖాజీ, మతగురువు మౌలానా అలీ అక్బర్ వివరించారు. కార్యక్రమంలో అంజుమన్ అబ్బాసియా కమిటీ అధ్యక్షుడు నియాజ్ అలీ, అబ్బాసియా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గులాం హుస్సేన్, షియా ముస్లిం పెద్దలు ఇక్బాల్ హుస్సేన్, జాఫర్ అలీ, షాకిర్, మహాదు, రహమత్ అలీ, ఆషక్ అలీ, అంజత్, అలీ మహమద్ పాల్గొన్నారు.



ఈద్గా వద్ద మాట్లాడుతున్న ఖాజీ మౌలానా అలీ అక్బర్

కేంద్రంలో కాంగ్రెస్ సంకీర్ణం ఖాయం

తిరుపతి రాజధాని నిర్ణయం నా వ్యక్తిగతం: చింతామోహన్



మాట్లాడుతున్న చింతామోహన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విపరీత బుద్ధులతో భారతీయ జనతా పార్టీకి వినాశ కాలం దగ్గర పడిందని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో 150 సీట్లకు లోబడి బిజెపి పతనావస్థకు చేరుతుందని కేంద్ర మాజీమంత్రి చింతామోహన్ స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఊహించని విధంగా ప్రజాభిమానాన్ని కూడగట్టి కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందన్నారు. కాంగ్రెస్ హయాంలో తిరుపతి పరిసర ప్రాంతాల అభివద్ధికి కేటాయించిన రహదారులు, కేంద్ర విద్యాసంస్థలను ఇచ్చి దేశ ఆర్థిక స్తోమతను పెంచిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ అన్నారు. తిరుపతి రాజధానిగా తాను వ్యక్తిత్వ నిర్ణయాన్ని తీసుకున్నానని, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయానికి రాజధాని విషయంలో కట్టుబడి ఉంటానని చింతామోహన్ స్పష్టం చేశారు. ఈసారి జరిగే ఎన్నికలు బిజెపి ది ప్రో రిచ్ పాలసీకి, కాంగ్రెస్ ది ప్రో పూర్ పాలసీకి అన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో విద్యావంతులను తయారు చేయాలనే లక్ష్యంతో స్కాలర్ షిప్లను ప్రవేశపెట్టిందని, తర్వాత వచ్చిన ప్రభుత్వాలు స్కాలర్షిప్లను పక్కన పెట్టడం దుర్మార్గమన్నారు. కొన్ని ప్రాంతాల పర్యటన తరువాత రాష్ట్ర రాజకీయాలపై స్పందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో శాంతి యాదవ్, తేజవతి, జావేద్, శ్రీనివాసులు రెడ్డి, తిరుపతి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు యార్లపల్లి గోపి పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తా..

- జీడీ నెల్లూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: సమన్వయంతో పనిచేస్తూ కార్యకర్తలను కలుపుకొని కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొనేందుకు కృషి చేస్తానని జీడీ నెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి రమేష్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ శ్రేణులను సమీకరించుకొని నామినేషన్ దాఖలు చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు చందురాణి, చంద్రబాబు, కన్నన్, వాసు, శివశంకర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

దర్గా కూడలి పనులు వేగవంతం చేయండి


- అధికారులను ఆదేశించిన చిత్తూరు కమిషనర్ డాక్టర్ జె.అరుణ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: నగరంలోని దర్గా కూడలిలో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులను కమిషనర్ డాక్టర్ జె.అరుణ బుధవారం పరిశీలించారు. అంబేద్కర్ విగ్రహం ఉన్న సర్కిల్ పునర్నిర్మాణ పనులను తనిఖీ చేశారు. పనులు జరుగుతున్న తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. గ్రీనరీ పెంచడంపై అధికారులతో చర్చించారు. దర్గా సర్కిల్లో దిశా పోలీస్ స్టేషన్ వైపు ఉన్న డివైడర్లను తగ్గించే పనులను పరిశీలించారు. వాహనాల రద్దీకి అనుగుణంగా డివైడర్లను పునర్నిర్మించాలని ఆదేశించారు. దర్గా కూడలిలో జరుగుతున్న పునర్నిర్మాణ, సుందరీకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈ గోమతి, డీఈ రమణ, ఏఈ లోకేష్ పాల్గొన్నారు.



ఆధునీకరణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్

రాజకీయ పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న తిరుపతి కమిషనర్



నామినేషన్ల ప్రక్రియకు అందరూ సహకరించండి

- తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదితి సింగ్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జరగనున్న నామినే షన్ల ప్రక్రియకు అందరూ సహకరించాలని తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ అదితి సింగ్ అన్నారు. నామినేషన్ల ప్రక్రియపై నగరపాలక సంస్థ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు. నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నామినేషన్లు వేయనున్న అభ్యర్థులు కూడా ఈ నిబంధనల మేరకు సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. 6, 7, 8 ఫామ్స్ ఈ నెల 15వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో రేణిగుంట వద్ద గల గోడౌన్‌లో ఈవి యంల రాండమైజేషన్ చేస్తామన్నారు. పూర్తైన వాటిని ఎప్పటికప్పుడు స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు రావాలన్నారు. నామినేషన్ల స్వీకరణ రిటర్నింగ్ కార్యాలయం, అర్బన్ తహశీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనుమానాలు నివృత్తి చేసేందుకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అర్బన్ తహశీల్దార్ నారాయణరెడ్డి, డి.టి. జీవన్ పాల్గొన్నారు.

పన్నుల రాయితీ సద్వినియోగం చేసుకోండి

- కమిషనరు ముప్పాళ్ల రమేష్ బాబు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి రాయితీ సద్వినియోగం చేసుకోవాలని కమిషనరు మప్పాళ్ల రమేష్ బాబు కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25వ మొదటి, రెండవ ఆర్థిక సంవత్సరానికి చెల్లించవలసిన ఇంటి, ఖాళీ జాగా పన్నులు ఈ నెల 30వ తేదీలోగా ఏక మొత్తంలో చెల్లిస్తే 5శాతం రాయితీ పొందవచ్చని ఆయన తెలిపారు. పురపాలక సంఘం పరిధిలోని 22 సచివాలయాల్లో పన్నులు చెల్లించుటకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. పట్టణ వాసులు తమ వార్డు సమీపంలోని సచివాలయంలో పన్నులు చెల్లించాలని ఆయన కోరారు. ఇక శ్రీకాళహస్తి పురపాలక సంఘ కార్యాలయంలో పన్నులు చెల్లించడానికి ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేశామని రమేష్ బాబు తెలిపారు. పుర ప్రజలు ఈ అవకాశం వినియోగించుకోవాలని ఆయన కోరారు. పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివద్ధికి సహకరించాలని రమేష్ బాబు విజ్ఞప్తి చేశారు.

నిత్యం మీతోనే ఉన్నా...: ఎమ్మెల్యే బియ్యపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: 'మీ ఆశీర్వాదంతో గెలిచాను.. నిత్యం మీతోనే ఉన్నాను.. కష్టకాలంలోనూ అండగా ఉన్నాను.. రానున్న ఎన్నికల్లో మళ్ళీ ఎమ్మెల్యేగా నన్ను ఆశీర్వదించాలి' అంటూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే 1, 5వ వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మెన్ మిద్దెల హరి, గుమ్మడి బాలకష్ణయ్య,జనార్ధన్ రావు జై పవర్, బర్రి హేమ భూషణ్ రెడ్డి, వాసుదేవ నాయుడు, లోకేష్ యాదవ్ ,పగడాల రాజు, వయ్యాల కష్ణారెడ్డి, పసల సుమతిలు ఘన స్వాగతం పలికారు. జగన్ సంక్షేమ పథకాలను, ఐదేళ్లలో శ్రీకాళహస్తిలో తాను చేసిన అభివద్ధిని ప్రజలకు వివరించారు. పండక్కో పబ్బానుకోవచ్చి ఓట్లు దండుకునే సుధీర్ లాంటి వ్యక్తులకు రానున్న ఎన్నికల్లో గట్టి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.



ఎన్నికల ప్రచారంలో బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఎన్నికల ప్రచారంలో టపాసులను రద్దు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ప్రమాదకరమైన, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న భారీ శబ్దాలతో కూడిన టపాసులను రద్దు చేయాలని బుధవారం కలెక్టరేట్లో జరిగిన సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచార ర్యాలీలో భాగంగా భారీ శబ్దాలతో పిల్లలను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న టపాసులను ఎన్నికల నిబంధనల ప్రకారం రద్దు చేయాలని ఉపయోగించిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సేవ చేస్తా.. ఆదరించండి: శివశంకర్



ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇచ్చి ఆదరించాలని కాంగ్రెస్ అభ్యర్థి శివశంకర్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ చేసేందుకు తాను ఎప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యేగా ఆదరిస్తే పలమనేరు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

నేడు మహతిలో

మహాత్మ జ్యోతిబాపూలే జయంతి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే 197వ జయంతిని టిటిడీ గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు జయంతి సభ ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులు మహాత్మ జ్యోతిబాపూలే జీవితంపై ప్రసంగిస్తారని పేర్కొంది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఉద్యోగులు పాల్గొననున్నారు.